హైడ్రాతో కుదేలైన స్థిరాస్తి రంగం

- ప్రోత్సాహకాల్లేక పరిశ్రమలు వెనక్కి
- వేధింపులతో ఏపీ వైపు సినిమా చూపు
- ఫార్మా విలేజ్‌లతో రైతుల్లో ఆందోళన
- బూమరాంగ్‌లతో హస్తం వణుకు!
- రేవంత్ పై కాంగ్రెస్ పెద్దల హైరానా

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్కో రంగం తిరోగమనంలో పయనిస్తున్నాయనే విమర్శ ఎదుర్కొంటున్నది. తెలంగాణను బీఆర్‌ఎస్ సర్కారు అన్నపూర్ణగా మార్చితే కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల భూములు లాక్కుంటూ ఆగం చేస్తున్నదని విశ్లేషకులు మండిపడుతున్నారు. ఏ రంగంలో చూసుకున్నా సీఎం రేవంత్‌రెడ్డి పనితీరు ఇలాగే ఉందని, ఒంటెత్తు పోకడలతో కాంగ్రెస్ కనుమరుగు ఖాయమని సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు నేతలు ఏకంగా అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిసింది.

ఏ రంగం చూసినా ఏమున్నది?

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే పెట్టుబడులు రావాలి, సంపద పెరగాలి. కానీ కక్షసాధింపులతో పాలన సాగిస్తే రాష్ట్రం అశాంతికి నిలయంగా మారుతుంది. తెలంగాణలో సరిగ్గా అదే జరుగుతున్నదని పరిశీలకులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. జలాశయాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపు పేరిట హైడ్రాను ఏర్పాటు చేసింది. పేదల కలల సౌధాలను కనికరం లేకుండా కూల్చివేసింది. హైడ్రా తరహా ఏజెన్సీలను రాష్ట్రమంతా విస్తరిస్తామని చెబుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జనాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. హైకోర్టు ఆదేశాలతో కూల్చివేతలకు విరామమిచ్చిన ప్రభుత్వం ఫార్మా విలేజ్‌లతో రైతులపై విరుచుకుపడింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతులతో చర్చించకుండా బలవంతపు భూసేకరణకు పూనుకున్నది. అభ్యంతరం తెలిపిన ప్రజలను అడ్డగోలుగా జైల్లో పెట్టింది. ప్రశ్నించిన మహిళలపై పోలీసులు కీచకపర్వం సాగించారు. జైల్లో మగ్గుతున్న రైతుకు గుండె నొప్పి వస్తే బేడీలు వేసి దవాఖానకు తరలించిన ప్రభుత్వ పెద్దలకు మానవత్వం ఉందా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పోరుపడలేక పారిపోతున్న పరిశ్రమలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో కొత్తగా ఒక్క పారిశ్రామికవాడను కూడా అభివృద్ధి చేయలేదు. ఒక్క పెద్ద పరిశ్రమను తీసుకురాలేదు. ప్రోత్సాహకాలు లేక పారిశ్రామికవేత్తలు తెలంగాణ వైపు చూడటం మానేశారు. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన పరిశ్రమలకు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు రిబ్బన్ కటింగ్‌లు చేస్తూ తమ ఘనతగా చెప్పుకుంటున్నారు. ఎంఎస్‌ఎంఈ పాలసీని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం విధివిధానాలు రూపొందించలేదు. ఈ ప్రభుత్వంతో పోరుపడలేకనే పరిశ్రమలు పక్కరాష్ట్రాలకు తరలిపోతున్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

సీఎం వైఖరితో మంత్రులు హైరానా

రేవంత్‌రెడ్డి ఏడాది పాలనపై ప్రజలతో పాటు మంత్రులు, సొంతపార్టీ ఎమ్మెల్యేలు కూడా అసంతృప్తి వ్యక్తంచేస్తున్నట్టు తెలుస్తున్నది. ఏడాదిలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న సర్కారు ఎంతకాలం మనుగడ సాగిస్తుందో చెప్పలేమంటూ సీనియర్లు కుమిలిపోతున్నట్టు సమాచారం. మంత్రివర్గంలో చర్చించకుండానే సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుంటే వ్యతిరేకతను మాత్రం తామంతా అనుభవించాల్సి వస్తున్నదని ఓ లీడర్ వాపోయారు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజల ముందుకు ఎలా వెళ్లాలని పాత కాంగ్రెస్ నేతలు చర్చించుకుంటున్నట్టు తెలిసింది.

టాలీవుడ్‌కు సినిమా చూపిస్తున్న సర్కారు

రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీగా ఆదాయాన్ని సమకూర్చుతూ వేల మందికి ఉపాధి కల్పిస్తున్న సినీ రంగాన్ని కూడా ప్రభుత్వం వదలడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సినిమా వాళ్లతో మంత్రులు గిచ్చికయ్యం పెట్టుకోవడం, అనవసర గొడవలు సృష్టించుకోవడం, అహం దెబ్బతిని అరెస్టు వరకు వెళ్లడం ఏంటని సినీవర్గాల్లో ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సినీపరిశ్రమ కార్యకలాపాలకు సీఎం వైఖరి ఆటంకంగా మారిందని కొందరు చెబుతున్నారు.

మళ్లీ మొదలైన మంచు లొల్లి

- జనరేటర్‌లో చక్కెర పోశాడని విష్ణుపై మనోజ్ ఆరోపణలు
- భద్రతపై ఆందోళన, పోలీసు కంప్లయింట్ ఇస్తానని వెల్లడి
- దాడిలో గాయపడ్డ రిపోర్టర్‌కు మోహన్‌బాబు క్షమాపణలు

హైదరాబాద్ సిటీ బ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): పోలీసుల హెచ్చరికలతో మంచు మోహన్‌బాబు కుటుంబంలో సద్దుమణిగిన గొడవ మళ్లీ మొదలైనట్టు కనిపిస్తున్నది. తన ఇంట్లోని జనరేటర్‌లో సోదరుడు విష్ణు చక్కెర కలిపిన డీజిల్ పోశాడని మనోజ్ ఆరోపించాడు. ఇలా చేయడం వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు అగ్ని ప్రమాదం జరిగే అవకాశముందని చెప్పాడు. ఈ మేరకు మనోజ్ ఆదివారం ఎక్స్‌లో ప్రకటన విడుదల చేశాడు. సోమవారం పహాడీ షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు పేర్కొన్నాడు. తాను, తన భార్య ఇంట్లో లేనప్పుడు తమ అమ్మకు పుట్టినరోజు కేక్ ఇచ్చేందుకు ఇంటికి వచ్చిన విష్ణు బౌన్సర్లతో కలిసి జనరేటర్‌లో చక్కెర కలిపిన డీజిల్ పోశాడని ఆరోపించాడు. ఆ సమయంలో తమ తల్లి, 9 నెలల కూతురు, బంధువులు మాత్రమే ఇంట్లో ఉన్నారని తెలిపాడు. అర్ధరాత్రి జనరేటర్లు పనిచేయలేదని, విద్యుత్ హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయని, ప్రమాదం జరిగేలా కుట్ర చేశారని ఆరోపించాడు.

సారీ సోదరా.. కావాలని చేయలేదు!

మోహన్‌బాబు దాడిలో గాయపడ్డ టీవీ రిపోర్టర్ రంజిత్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. దాడి కేసులో పోలీసులు ఇప్పటికే మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం దవాఖానకు వెళ్లిన మోహన్‌బాబు రిపోర్టర్ రంజిత్‌ను పరామర్శించి, క్షమాపణలు తెలిపారు. ఉద్దేశపూర్వకంగా దాడి చేయలేదని, అనుకోకుండా జరిగిందని చెప్పారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కొత్త రేషన్‌కార్డులు ఉత్తముచ్చటే!

- గెలవగానే ఇస్తామని కాంగ్రెస్ హామీ
- ఏడాదైనా అతీగతీ లేని కొత్త కార్డులు
- క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ఎప్పుడు బయటకు వచ్చేనో!
- సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు లింకుతో సర్కారు పరిహాసం

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజల ఎదురు చూపులు తప్పడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కొత్త కార్డుల జారీపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల్లో ఉలుకు పలుకు లేదు. మొదట్లో క్యాబినెట్ సబ్ కమిటీ, దరఖాస్తుల స్వీకరణ పేరుతో హడావుడి చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఆ మాట కూడా ఎత్తడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తక్షణమే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మభ్యపెట్టారు. గద్దెనెక్కిన తర్వాత హామీని బుట్టదాఖలు చేశారని జనం ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

క్యాబినెట్ సబ్‌కమిటీ నివేదిక ఏమైనట్టు?

రాష్ట్రంలో 89.97 లక్షల తెల్లరేషన్‌కార్డులు, 2.81కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. కాంగ్రెస్ సర్కారు ప్రజాపాలన పేరుతో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించింది. కొత్తరేషన్‌కార్డుల కోసం 10 లక్షల దరఖాస్తులు, కార్డుల్లో మార్పుల కోసం 11.33 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షుడిగా మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సభ్యులుగా క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. విధివిధానాలు రూపొందిస్తామంటూ కమిటీ పలుసార్లు భేటీ అయింది. కానీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వలేదు. ఈ కమిటీ నివేదిక ఇచ్చేదెప్పుడు..? కొత్త కార్డులు జారీ చేసేదెప్పుడు అని ప్రజల్లో ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

కోతల కోసమే జాప్యమా?

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చింది. పథకాలపై ఆశలు పెట్టుకున్న జనం నిరాశతో నిట్టూరుస్తున్నారు. మరోవైపు హామీలకు, పథకాలకు రేషన్‌కార్డుతో ప్రభుత్వం లింక్ పెడుతున్నది. ఎన్నికల సమయంలో ఇవేమీ చెప్పలేదు కదా అని ప్రశ్నిస్తున్న జనాలు కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడుతున్నారు. పథకాలను ఎగ్గొట్టేందుకే రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం దృష్టి పెట్టడంలేదని, ఆరు గ్యారెంటీల అమలు కూడా ఉత్తముచ్చటే అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చార్జీలు పెంచండి

క్యాబ్ డ్రైవర్ల ఆందోళన

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఫేర్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా ఎయిర్‌పోర్ట్‌కు క్యాబ్ సర్వీసులు నిలిపివేసినట్టు తెలంగాణ గిగ్ అండ్ క్యాబ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ సలావుద్దీన్ తెలిపారు. ఓల, ఉబర్, ర్యాపిడో సర్వీసులు ఎయిర్‌పోర్ట్‌కు బంద్‌చేసి 34 వేల మంది డ్రైవర్లు బంద్‌లో పాల్గొంటున్నట్టు చెప్పారు. తక్కువ చార్జీలు పే చేస్తూ సంస్థ అత్యధికంగా లాగేసుకుంటుందని పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థలను రద్దుచేసి ప్రభుత్వమే క్యాబ్ ఆధారిత యాప్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. గతంలో క్యాబ్ డ్రైవర్లను ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి మాటిచ్చారని, ఇప్పుడు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

దొడ్డి కొమురయ్య వారసులకు అవమానం

- దొడ్డి కొమురయ్య భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- కొమురయ్య వారసులను ఆహ్వానించని ప్రభుత్వం

దొడ్డి భిక్షపతి, దొడ్డి చంద్రం

దేవరుప్పుల, డిసెంబర్ 15: హైదరాబాద్‌లోని కోకాపేటలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ భవనాన్ని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించగా, తమను ఆహ్వానించకపోవడంపై కడవెండిలోని ఆయన వారసులు ఆవేదన వ్యక్తంచేశారు. దొడ్డి కొమురయ్య స్వస్థలం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామం. ఇక్కడ ఆయన వారసులు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో పెట్టిన కురుమ సంఘానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టి కనీసం ఆయన వారసులుగా తమను ఈ ప్రారంభ కార్యక్రమానికి పిలువకపోవడం అవమానంగా భావిస్తున్నామని కొమురయ్య అన్న కుమారుడు దొడ్డి భిక్షపతి, మనుమడు దొడ్డి చంద్రం తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరులో తమ కుటుంబం నుంచి ముగ్గురిని కోల్పోయినట్టు చెప్పారు. సాయుధ పోరులో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఖ్యాతి ఖండాంతరాలకు పాకిందని, రష్యాలో ఓ వీధికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టిన విషయాన్ని వారు గుర్తుచేసుకున్నారు. సొంత రాష్ట్రంలో నిర్మించిన ఈ కురుమ భవనానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టినందుకు గర్వంగా భావించామని, అయితే అదే భవన ప్రారంభానికి తమకు ప్రభుత్వ పక్షాన ఆహ్వానం అందకపోడంపై ఒకింత ఆశ్చర్యానికి గురైనట్టు తెలిపారు. నాడు దొరల పాలనలో వివక్షకు గురైన తాము నేడు పాలకుల వివక్షకు గురైనట్టు భావిస్తున్నామని వాపోయారు.

వారంపాటు అసెంబ్లీ?

- నేడు బీఏసీ సమావేశం
- మ.2 గం.లకు క్యాబినెట్‌భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ శీతాకాల సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నెల 9న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పటికీ, సోమవారం వరకు వాయిదా పడిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం సమావేశాలు పునఃప్రారంభమైన తర్వాత తొలుత సభ్యుల మౌఖిక ప్రశ్నోత్తరాలు నిర్వహించనున్నారు. అనంతరం బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం కానున్నది. సభను ఎన్ని రోజులు నిర్వహించాలి? ఏయే బిల్లులు ప్రవేశపెట్టాలి? వంటి అంశాలపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సభ సమావేశాలను వారంపాటు నిర్వహించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. పంచాయతీ రాజ్, మున్సిపల్ వ్యవహారాలు సహా పలు శాఖల బిల్లులు సభకు వచ్చే అవకాశాలున్నట్టు తెలిసింది. కాగా, గత సోమవారం సమావేశాల ప్రారంభం రోజే తెలంగాణతల్లి నూతన విగ్రహం, రూపురేఖలు వంటి అంశాలపై సభలో చర్చించారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ సభ్యులను ఉభయసభల్లోకి ఉద్దేశపూర్వకంగానే రాకుండా చేసి, ప్రభుత్వం చర్చ పెట్టిందనే విమర్శలు వినిపించాయి. తెలంగాణ ప్రజలు ఆరాధించిన తల్లిని కాదని, అభయహస్తం తల్లిని ఉద్దేశపూర్వకంగా రుద్దాలనే కుట్రను ప్రభుత్వం చేసిందని, ఆ బండారం అంతా తాము బయటపెడతామనే భయంతోనే తమను ముందస్తుగానే సభకు రాకుండా అరెస్టు చేయించిందని బీఆర్‌ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలపై సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠ నెలకొన్నది.

నేడు క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రివర్గం సోమవారం భేటీ కానున్నది. శాసనసభ ప్రాంగణంలోని అసెంబ్లీ కమిటీ హాల్-1లో మధ్యాహ్నం రెండు గంటలకు క్యాబినెట్ సమావేశం కానున్నది. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న పలు బిల్లులపై క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదించనున్నారు.

లగచర్ల రైతుకు బెయిలెప్పుడు?

మొదటిపేజీ తరువాయి...

ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్నారు. ఈ క్రమంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. బలవంతపు భూసేకరణపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేపట్టిన ఆందోళన ఒక్కసారిగా అదుపు తప్పడం, వాహనాల ధ్వంసం వరకు వెళ్లడం తెలిసిందే. లగచర్ల సంఘటనలో ఎవరికీ చిన్నపాటి గాయాలు కూడా కాలేదు. అయినప్పటికీ ఈ ఘటనలో బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో సహా దాదాపు 24 మంది రైతులను పోలీసులు అరెస్టు చేశారు. వారంతా 34రోజులుగా జైలులోనే మగ్గిపోతున్నారు. సదరు రైతుల బెయిల్ పిటిషన్లు ఏదో కారణంతో వాయిదా పడుతూ వస్తున్నాయి. భూములు ఇవ్వకుండా అడ్డంపడటం, భూసేకరణ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి రావడంతో తలదించుకునే పరిస్థితి వచ్చింది. దీనిని మనసులో పెట్టుకున్న ప్రభుత్వం ఈ విషయాన్ని వ్యక్తిగతంగా తీసుకున్నదని, ఈ కారణంగా వారి బెయిలు విషయంలో అంత శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు బెయిలు పిటిషన్లు వేసిన ప్రతిసారి ప్రభుత్వం ఏదో ఒక సాకు చూపుతుండటంతో వారి పిటిషన్లు ప్రతిసారి వాయిదా పడుతూ వస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కుంటిసాకుల ముందు నిందితుల బెయిలు హక్కు ఓడిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరస్పర భిన్నంగా..

పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా ఇటీవల సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు ప్రస్తుతం మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ సంఘటనకు బాధ్యుడు అంటూ సినీ నటుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారు. అదే రోజున కోర్టులో విచారణ జరగడం, రిమాండ్ విధించడం, ఆ వెంటనే హైకోర్టులో బెయిలు మంజూరు కావడం చకచకా జరిగిపోయాయి. ఇప్పుడీ ఘటనను లగచర్ల రైతుల ఘటనతో ముడిపెడుతూ నెటిజన్లు విపరీత చర్చకు తెరతీశారు. అల్లు అర్జున్ బెయిలు విషయంలో వ్యతిరేకించని ప్రభుత్వ న్యాయవాదులు.. లగచర్ల రైతుల విషయంలో మాత్రం అడ్డుతగులుతూ, వారిని బయటకు రాకుండా కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తున్నారు. 'బెయిల్ ఈజ్ రూల్.. జైల్ ఈజ్ ఎక్సెప్షన్' (బెయిలు అనేది నియమం.. జైలు అనేది మినహాయింపు) అన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను కూడా తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడుతున్నారు. మరో నటుడు బహిరంగంగానే దాడిచేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, లగచర్ల విషయంలో తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టరే చెప్పినా ప్రభుత్వం అత్యుత్సాహంతో అన్నదాతలను అరెస్ట్ చేసి జైలుకు పంపిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులపై ప్రభుత్వ కుట్ర!

సినీ నటుడికి లభించినంత త్వరగా లగచర్ల రైతులకు బెయిల్ రాకపోవడం వెనక ప్రభుత్వ కుట్ర, నిర్లక్ష్యమే కారణమని నెటిజన్లు, తెలంగాణ మేధావులు సోషల్‌మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్న తీరుతోనే లగచర్ల రైతులకు బెయిల్ లభించడం లేదని దుమ్మెత్తి పోస్తున్నారు. అల్లు అర్జున్ విషయంలో వందలాది మంది పోలీసులు, వందలాది ప్రభుత్వ ఉద్యోగులు జెట్‌స్పీడుతో పనిచేశారని నెటిజన్లు విమర్శిస్తున్నారు. వ్యవసాయ భూముల కోసం నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను 34 రోజులుగా జైలులో పెట్టి, కావాలనే అనేక సాకులు చూపుతూ బెయిల్ రాకుండా ప్రభుత్వమే అడ్డుకుంటున్నదని, సర్కారు ఆదేశాలతో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు వారిపై చార్జిషీట్ కూడా దాఖలు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులకు సంబంధించిన బెయిల్ పిటిషన్లు వాయిదా పడుతున్నాయని వివరిస్తున్నారు. ఉద్దేశపూర్వక జాప్యంతో వీలైనంత వరకు వారిని జైలులో ఉంచాలని ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టుగా ఉన్నదని విమర్శలు గుప్పిస్తున్నారు. అల్లు అర్జున్‌కి ఇచ్చిన సమయంలో సగం సమయమిచ్చి నా రైతులకు బెయిల్ ఎప్పుడో వచ్చేదని చెప్తున్నారు. ప్రభుత్వమే ఈ పరిస్థితికి కారణమని నిప్పులు చెరుగుతున్నారు. అల్లు అర్జున్‌కు ఒకే.. మరి లగచర్ల రైతులకు ఎప్పుడు విడుదల అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నిస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి ఆనుకొని ఉన్న 11 కేవీ విద్యుత్తు వైర్లు

విద్యుత్తు షాక్‌తో కార్మికుడు మృతి

హైవే అధికారుల నిర్లక్ష్యం

వేంసూరు, డిసెంబర్ 15 : ఖమ్మంజిల్లా వేంసూరు-ఎర్రగుండపాడు మధ్య ఎన్టీఆర్ కెనాల్‌పై 11కేవీ విద్యుత్తువైర్లు ఉన్నా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా బ్రిడ్జి పనులు చేపట్టారు. కేఎంవీ కంపెనీ సైట్ ఇంజినీర్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు కార్మికులకు రక్షణ కవచాలు ఇవ్వలేదు. కాంక్రీట్ మిషన్ వైర్లకు తగలడంతో విజయనగరం జిల్లా మగ్గురకు చెందిన భాస్కర్‌రావు(37) అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహబూబాబాద్ జిల్లా కురవిలో దీక్ష చేస్తున్న రైతు సహదేవ్

రుణమాఫీ కోసం రైతు దీక్ష

- మహబూబాబాద్ జిల్లా కురవిలో ప్రారంభం
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై నిరసన

కురవి, డిసెంబర్ 15 : రుణమాఫీ చేయాలని కోరుతూ ఓ రైతు నిరాహార దీక్షకు దిగిన ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్నది. మండలంలోని తట్టుపల్లి గ్రామానికి చెందిన బేతమళ్ల సహదేవ్‌కు రెండు ఎకరాల పట్టా భూమి ఉన్నది. వ్యవసాయం చేస్తూనే పార్ట్‌టైంగా మీడియాలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కురవి సొసైటీ పరిధిలోని ఆంధ్రాబ్యాంకులో రూ.60 వేల రుణం తీసుకున్నాడు. మిత్తితో మొత్తం రూ.83,995 ఉన్నది. తనకు అన్ని విధాలా అర్హతలు ఉన్నా రుణ మాఫీ కాలేదని రైతు సహదేవ్ ఆవేదన వ్యక్తంచేశారు. రూ.2 లక్షల లోపు రుణం ఉండి మాఫీ కాకుండా ఉన్న రైతుల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు నిరసన దీక్ష చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ దీక్షకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, దొడ్డి గోవర్ధన్‌రెడ్డి, గుగులోత్ రవి, రాజునాయక్, సాంబశివరావు, వెంకన్న, రమేశ్, సైదులు, వీరభద్రం, జర్నలిస్టు రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద సొసైటీ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

నాణ్యత లేదంటూ 'సోయా' వెనక్కి

- నాఫెడ్ నుంచి తిరిగి వచ్చిన లారీలు
- రైతుల ఆగ్రహం, రోడ్డుపై నిరసన
- అధికారుల తీరుపై అసహనం
- న్యాయం చేయాలంటూ డిమాండ్
- కామారెడ్డి జిల్లా బిచ్కుందలో ధర్నా

బిచ్కుంద, డిసెంబర్ 15 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో సోయా పంటను కొని, వారం రోజుల తర్వాత నాణ్యత లేదంటూ తిరిగి పంపించడంతో ఆగ్రహించిన రైతులు ఆదివారం రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం గోపన్‌పల్లికి చెందిన 20 మంది రైతులు ఈ నెల 10న బిచ్కుంద రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సోయా పంటను విక్రయించారు. కాగా 1200 బస్తాల సోయా పంటను (మూడు లోడ్ లారీలు) నాఫెడ్ (నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్) అధికారులు ఆదివారం తిరిగి పంపించారు. దీంతో రైతులు సొసైటీ ఎదుట బైఠాయించి, తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. కొనుగోలు సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి అమ్మితే ఐదురోజుల తర్వాత నాణ్యత లేదని తిరిగి పంపడం ఏంటని ప్రశ్నించారు. సొసైటీ అధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఆంధ్రా వడ్లకు బోనస్!

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణకు చెందిన కొందరు మిల్లర్లు కొమ్ముకాస్తుండటంతో ఆంధ్రాకు చెందిన కొందరు వ్యాపారులు పెద్ద మొత్తంలో ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఆయా శాఖల కంట పడకుండా, పదుల సంఖ్యలో ఉన్న చెక్‌పోస్టులను దాటుకొని ఆంధ్రా ధాన్యం తెలంగాణకు చేరుకుంటుండటం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజుకు 50 నుంచి 100 లారీల చొప్పున 20 రోజులుగా భారీ లోడుతో తెలంగాణలోకి ప్రవేశిస్తుండటాన్ని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల రైతులు గమనించారు. ఈ క్రమంలో ఆదివారం కూడా పెద్ద సంఖ్యలో వస్తున్న లారీలను నేలకొండపల్లి మండలం చెరువుమాధారం రైతులు అడ్డగించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆంధ్రాలోని విజయవాడ, తెనాలి వ్యాపారులు తెలంగాణలోని కొందరు మిలర్లు, దళారులతో కుమ్మక్కై ఈ దందాను సాగిస్తున్నట్టు తెలుస్తున్నది.ఏపీ విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం నుంచి ఎన్టీఆర్ జిల్లా గండ్రాయి మీదుగా కొన్ని లారీలు చెరువుమాధారానికి చేరుకుంటున్నాయి. ఇక్కడి నుంచి ఖమ్మం - కోదాడ హైవే ఎక్కించి మిర్యాలగూడకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో చెరువుమాధారం రైతులు ఈ లారీలను ఆదివారం అడ్డగించి లారీ డ్రైవర్లను ప్రశ్నించారు. డ్రైవర్లు నీళ్లు నమలడంతో విషయం బహిర్గతమైంది. ఇంతలో నేలకొండపల్లి ఎస్సై సంతోశ్ అక్కడికి చేరుకుని రైతులు పట్టుకున్న లారీలను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరికొన్ని లారీలను చెరువుమాధారం చెక్‌పోస్టు వద్ద నిలిపివేశారు. తరువాత వాటిని ఆంధ్రాకు తిరిగి పంపారు. ముదిగొండ మండలం వల్లభి గ్రామం వద్ద శనివారం రాత్రే కొన్ని లారీలను గ్రామస్థులు అడ్డుకొని వెనక్కి పంపించారు.

నేలకొండపల్లి మండలం చెరువుమాధారం వద్ద గ్రామ రైతులు నిలిపివేసిన ఆంధ్రా ధాన్యం లారీలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంతోశ్

అక్రమంగా తెలంగాణలోకి ధాన్యం

మాగనూరు/కృష్ణ, డిసెంబర్ 15 : తెలంగాణలోకి అక్రమంగా ధాన్యం తరలిస్తున్న ఆరు లారీలను సీజ్ చేసిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణా పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గుర్రాజారావు, కృష్ణ ఏవో సుదర్శన్‌గౌడ్ కథనం మేరకు.. కృష్ణ మండలం చేగుంట సమీపంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి కర్ణాటక నుంచి తెలంగాణలోకి అక్రమంగా చొరబడుతున్న ఆరు లారీలను ఆపగా.. ఆధారాలు లేకపోవడంతో వాటిని కృష్ణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కర్ణాటక రాష్ట్రం సిరిపూర్ గ్రామం నుంచి తెలంగాణలోని మిర్యాలగూడ శివశంకర ఇండస్ట్రీస్‌కు తరలిస్తున్నట్టు విచారణలో తేలింది.

కేసీఆర్ ఇండ్లకు కాంగ్రెస్ రంగులు

- భద్రాచలంలో 'డబుల్' ఇండ్లకు 'మూడు' కలర్లు
- నిధులిచ్చింది, నిర్మించింది గత ముఖ్యమంత్రి కేసీఆర్
- ఇప్పుడొచ్చి రంగులేసుకున్న కాంగ్రెస్ పాలకులు
- తామే ఇచ్చినట్టు బిల్డప్
- నివ్వెరపోయిన లబ్ధిదారులు



భద్రాచలం, డిసెంబర్ 15: 'సొమ్మొకరిది.. సోకొకరిది' అనే నానుడికి కరెక్టుగా సరిపోయేలా భద్రాచలంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ జరిగింది. బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకాన్ని ప్రారంభించి భద్రాచలానికి 88 ఇండ్లను కేటాయించారు. ఏఎంసీ కాలనీలో ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున వెచ్చించారు. ఆ ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 2018 తరువాత మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్.. పట్టణానికి రెండో విడత 250 ఇండ్లను కేటాయించారు. ఒక్కో ఇంటికి రూ.5.04 లక్షల చొప్పున రూ.12 కోట్ల నిధులను వెచ్చించారు. మనుబోతులగూడెం, ఏఎంసీ కాలనీల్లో వీటిని ప్రారంభించారు. ఇందులో 117 ఇండ్లను పూర్తిచేశారు. లబ్ధిదారులకు పంపిణీ చేసేలోపే 2023 అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్ ఇండ్లను ఖాతాలో వేసుకోవాలని స్కెచ్ వేసింది. శనివారం 111 ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసింది. ఆ ఇండ్లకు కాంగ్రెస్ పార్టీకి చెందిన మూడు రంగులను వేసి, తమ ప్రభుత్వమే కట్టించి ఇచ్చిందని కలరింగ్ ఇచ్చింది. నిజానికి ఈ 250 ఇళ్లకు రూ.12 కోట్ల నిధులను కేటాయించింది కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన వాటిలో మరో 133 ఇండ్లు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. కాంగ్రెస్ పాలకుల తీరుపై లబ్ధిదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.